# అతని కంటే ఘనుడు







కోరుకొండ సత్యానంద్

ఇక లాభం లేదు, ఊరుకొని లాభం లేదు! ఎంతకాలం ఇలా? మనిషికున్న నాలుగు దశల్లో ఒక్కో దశలో ఒక్కో అనుభవం! ఏ వయసుకు ఆ ముచ్చట అని పెద్దలు ఊరకే అన్నారా? పెద్దవాడు కదా అని నోరు మెదపకుండా వాడికి మర్యాద ఇస్తుంటే వాడు ఆ మర్యాద నేమైనా నిలుపుకున్నాడా? ఇంజనీరువైపోయి అప్పడే అయిదు సంవత్సరాలు అయిపోయింది... వా తర్వాతవాడు కూడా ఇంజనీరైపోయి బెంగుళూరులో వర్క్ చేస్తున్నాడు... ముగ్గురం మూడెళ్ళు ఆరు చేతులా సంపాదిస్తున్నాం... కానీ ఏమిటి లాభం? ఒక అందం లేదు, ఆనందం లేదు... ఒక్కటే రొటీన్ లైఫ్!

వాడు డాక్టరైనంత మాత్రాన విరాగై పోవాలా? దేశంలో ఎంతమంది డాక్టర్లు లేరు? అందరూ వీడిలాగే అయితే పేపర్లలో ముక్కు మీద వేలేసుకోవాల్సిన వార్తలు ఎన్ని వుండక పోవును? ఇక ఊరుకొని లాభం లేదు... ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా 'సరిత'ను పెళ్ళి చేసుకొని తీసుకొచ్చేయాలి... అప్పుడైనా వాడికి సిగ్గొస్తుందేమో!

ముప్పై అయిదేళ్ళొచ్చినా పెళ్ళి చేసుకోని అన్నగార్ని అలవాటుగా తిట్టుకున్నాడు శంకరం!

** ** ** **

ఆ రోజు అందరూ ఆశ్చర్యపోయారు...

చక్కగా, బుద్ధిగా వుండే శంకరం ఎంత పని చేశాడు?

"ఇదేం పనిరా, అన్నయ్య పెళ్ళి చేసుకోకుండా నువ్వు చేసుకోవడం ఏమిటి? చదూకున్నావ్, ఎందుకు?" అని ఇంకా... పరువు, ప్రతిష్ఠ, సంఘం, సమాజం, ఇంగిత జ్ఞానం... ఇలాంటి వాటి గురించి అరగంటసేపు అరచి అలిసిపోయారు తల్లిదండ్రులు...

అన్నీ విని ఒక బారెడు నిట్టూర్పు విడిచి "వుండమంటే ఇంట్లో వుంటాను, పొమ్మంటే బయటికి పోతాను సరితతో... ఏం చెయ్యమంటారో చెప్పండి..." అన్నాడు శంకరం.

తల్లిదండ్రులు, అన్నగారు ఏమీ మాట్లాడక పోవడంతో మౌనం సంపూర్ణాంగీకారం అనుకొని చక్కగా ఇంట్లోకి వెళ్ళిపోయాడు శంకరం సతీమణి సరితతో.

** ** ** **

తమ్ముడ్ని, మరదల్ని, వాళ్ళ సరదాల్ని, సంతోషాన్ని చూసి ఏదోలా ఫీలయ్యేవాడు ఆనందరావు. వాళ్ళు సినిమాకు వెళ్తుంటే ఏదోలా వుండేది ఆనందరావుకి. 'వయసులో వున్న మగవాడి ప్రక్కన యవ్వనాన్ని నింపుకుని వున్న ఆడది వుంటే ఎంత అందం?' అనిపించేది అతనికి.

ఆనందరావు ప్రక్కగదిలోనే తమ్ముడు, మరదల మకాం. రాత్రుళ్ళు వాళ్ళ నవ్వులు, వినిపించీ వినిపించనట్టుండే మాటలు ఆనందరావు యవ్వనాన్ని పురికొల్పాయి.

ఆలస్యం చెయ్యకుండా ఆనందరావు కూడా పెళ్ళి చేసుకుంటానన్నాడు నెమ్మదిగా.

అతనిలో వచ్చిన మార్పుకు ఇంట్లో వాళ్ళందరూ ఆశ్చర్యపోయి తెగ ఆనందపడిపోయారు. అర్జెంటుగా ఓ అమ్మాయిని చూసి ఆ సంవత్సరంలోనే, సారీ ఆ నెల్లోనే ఆనందరావు పెళ్ళి నిశ్చయించేశారు.

ఆనందరావు పెళ్ళిరోజు వచ్చేసింది.

రాత్రి ముహూర్తం. మధ్యాహ్నం భోజనాలు చేసి బంధువులందరూ పందిట్లోకూర్చున్నారు. స్నేహితుల్తో సరదాగా మాట్లాడుతూ పందిట్లో ఒక చోట కూర్చున్నాడు ఆనందరావు. శంకరం, తల్లిదండ్రులు పెళ్ళి పనుల్లో మునిగివున్నారు.

అంతలో పోస్ట్‌మాన్ వచ్చి ఓ కవరు అందించాడు ఆనందరావుకి. అది ఆనందరావు పేరనే వచ్చింది. ఆనందరావు గబగబా విప్పి చదవడం మొదలు పెట్టాడు.

"అన్నయ్యా, కంగ్రాట్యులేషన్స్!

శంకరం అన్నయ్య తన పెళ్ళి గురించి లెటర్ వ్రాశాడు. ఇక్కడ చాలా బిజీగా వుండడంవల్ల జవాబు వ్రాయలేకపోయాను. శంకరాన్ని ఏమీ అనుకోవద్దని చెప్పు.

నేను నీ పెళ్ళికి కూడా రాలేకపోతున్నందుకు చాలా విచారిస్తున్నాను. కారణం ఏమిటంటే 'మృదుల'ను ఆసుపత్రిలో జాయిన్‌చేశాను. డెలివరీ టైం వచ్చేసింది. సారీ! అన్నట్టు నీకు మృదుల అంటే తెలియదు కదూ!? మృదుల, నేను ప్రేమించుకుని పెళ్ళి చేసుకున్నాం సంవత్సరంన్నర క్రితం... మీరేమంటారోనని భయంవేసి ఇంతవరకు ఈ విషయాన్ని తెలియ బరచలేదు... డెలివరీ అయిపోయాక నాన్నగారు, అమ్మ, మీరందరూ నేను మృదులతో వచ్చేందుకు సమ్మతించి రమ్మనమని వ్రాస్తే వస్తాము...

నాన్నగార్ని, అమ్మను, శంకరం అన్నయ్యను, సరిత ఒదినను అడిగినట్లు చెప్పు. విష్ యూ హేపీ మేరీడ్ లైఫ్!

— రామం!"

ఉత్తరం చదవడం పూర్తిచేసి అలాగే వుండిపోయాడు ఆనంద రావు...

"ఎక్కడ్నుంచి వచ్చిందిరా ఉత్తరం?"

అప్పుడే వచ్చి అడుగుతున్న తండ్రికి సమాధానంగా... బెంగుళూరులో వుంటున్న తన రెండో తమ్ముడైన రామం వ్రాసిన ఆ ఉత్తరాన్ని అందించాడు ఆనందరావు.